క్లుప్తంగా

పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి అర్చకులతో ప్రత్యేక అలంకరణ చేసారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలు నివారించడానికి జాగ్రత్తలు పాటించాలని, హెల్మెట్ విధిగా ధరించాలని ఏఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు, పాదచారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో వ్యవసాయాధికారి పర్యటన

సీతానగరం: మండలంలోని గుచ్చిమి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ రబీ పంటలను క్షేత్ర స్థాయిలో గురువారం పరిశీలించారు. రబీ పంట కాలంలో ఈ పంట నమోదు చేసిన సర్వే నంబర్లలో కొన్ని రాండమ్‌గా వస్తాయని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా సూపర్ చెక్ చేస్తున్నామని తెలిపారు. వీటికి సంబంధించిన వివరాలను సంబంధిత యాప్‌లో వ్యవసాయ సహాయకులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆయన వెంట గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం టౌన్: నర్సిపురం సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనుల కారణంగా 11 కేవీ సాయినగర్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం కలగనున్నట్టు ఆ శాఖ ఈఈ ఒ.గోపాలరావునాయుడు గురువారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నర్సిపురం, ఆనంద్‌నగర్, వేకేఎం కాలనీ, వసుంధరానగర్ కాలనీ, గృహప్రియ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

డయల్ యువర్ డీఎంకు స్పందన



ఆర్టీసీ డీఎం భాస్కరరెడ్డి

సాలూరు: ఆర్టీసీకి సంబంధించి పట్టణంలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంకు మంచి స్పందన లభించిందని ఆర్టీసీ డీఎం భాస్కర రెడ్డి తెలిపారు. ప్రధానంగా సాలూరు, పార్వతీపురం మధ్య ఎక్స్‌ప్రెస్ సర్వీసు నడపమని, వయోవృద్ధులకు 25 శాతం రాయితీ అమలు చేయాలని, రామభద్రపురం గుడి వద్ద బస్సులు ఆపాలని, మంచాడవలస, విశ్వనాధపురం, గడివలసల మీదుగా పాచిపెంట – సాలూరు మధ్య బస్సు నడపాలని తదితర అంశాలను ప్రజలు తెలిపారన్నారు. వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలి

సాలూరు రూరల్: పిల్లల పట్ల తల్లితండ్రులు బాధ్యతగా ఉండాలని, మాతృభాషను గౌరవించే విధంగా తీర్చిదిద్దాలని అఖిల భారత శిక్షా సంస్థాన్ జాతీయ కార్యదర్శి బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని మామిడిపల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడిపల్లి శిశుమందిర్ కేంద్రంగా 15 గిరిజన గ్రామాలలో శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యాపీఠం ఆధ్వర్యంలో బాల సంస్కార కేంద్రాలు మీ అందరి సహకారంతోనే సక్రమంగా నడుస్తున్నాయన్నారు. సమాజానికి సంస్కారవంతమైన యువకులను అందించే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ చిన్నారుల చదువు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గిరిజన నాయకుడు సంగంరెడ్డి జయసింహ, శ్రీ సరస్వతీ శిశుమందిర్ విజయవాడ సమితి సభ్యులు కాలేటి రంగారావు, మరిపల్లి ఎంపీటీసీ జన్ని సీతారాం తదితరులు పాల్గొన్నారు.

గేటు పడిందా.. అంతే మరి...!



రైల్వే గేటు వేయడంతో గేటు దాటి వెళ్తున్న వాహన చోదకులు, స్థానికులు

- బెలగాం రైల్వే గేటు వద్ద నిత్య అవస్థలు
- 25 గ్రామాల ప్రజలకు తప్పని ఇబ్బందులు
- వాహనచోదకులకు పాట్లు
- అత్యవసర పరిస్థితుల్లో టెన్షన్..!

పార్వతీపురం టౌన్:

పార్వతీపురం జిల్లా కేంద్రంగా ఏర్పడంతో జన సాంద్రత పెరిగింది. వాహనాల సంఖ్య కూడా పెరిగింది. రోజురోజుకూ వాహనాలు పెరుగుతుండడంతో బెలగాం రైల్వే గేటు పడిన సమయంలో అక్కడ భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. పార్వతీపురం పట్టణంలోని ఒక భాగమైన బెలగాంతో పాటు బాలగుడబ, పెదగుడబ, చినగుడబ, వల్లరిగుడబ తదితర 25 గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే రైళ్ల రాకపోకలు సాగించే వేళల్లో బెలగాం వద్ద ప్రతీసారి దాదాపు అర్ధ గంటకు పైగా రైల్వే గేటు పడుతుంది. దీంతో అటుగా వెళ్లాల్సిన ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల మూడవ లైన్ కూడా వేయడంతో రైళ్ల రద్దీ మరింత పెరిగింది. నిత్యం వేలాది మంది ప్రజలు, ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే టప్పుడు గేటు పడిందంటే వారు ఆలస్యంగా చేరుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పశుసంవర్ధక శాఖ ఆస్పత్రి, వ్యవసాయ శాఖ కార్యాలయం గేటుకు అటువైపు ఉండడంతో బెలగాం వాసులతో పాటు పలు గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● అత్యవసర చికిత్స అందని పరిస్థితి

రోగులకు సరైన సమయంలో చికిత్స అందక ప్రాణాలు పోయే పరిస్థితి ఒక్కోసారి ఏర్పడుతుంది. అలాగే చాకలి బెలగాంలో విద్యార్థుల ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి. రైల్వే ట్రాక్ వలన సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేమని భయపడి విద్యార్థులు వసతి గృహాల్లో చేరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అండర్ పాస్ బ్రిడ్జిగానీ, ఫ్లైఓవర్‌గానీ నిర్మించాలని వీరంతా కోరుతున్నారు. అమృత భారత్ ప్రాజెక్టుకు పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ ఎంపికయ్యింది. ప్రస్తుతం ఈ స్టేషన్‌ను ఆధునీకరిస్తున్నారు. అందులో భాగంగా పట్టణ బైపాస్ రోడ్డు నుంచి పార్వతీపురం (బెలగాం) స్టేషన్‌కు అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఇది ఇంకా వినియోగానికి రాలేదు. ఇది బెలగాం గేటుకు కిలోమీటరు దూరంలో ఉంది. కలెక్టర్, ఎస్పీ ఇలా అనేక కార్యాలయాలతో పాటు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే ఇక్కడ నుంచి అర కిలోమీటరు దూరం మాత్రమే ఉంటుంది. కొత్తగా వేసిన ఈ అండర్ బ్రిడ్జి నుంచి వెళ్తే దూరం అవుతుంది.

> **ఇబ్బందులు పడుతున్నాం..**
>
> 
>
> బెలగాం వద్ద రైల్వే గేటు పడితే అరగంట వరకూ వేచి ఉండాల్సి వస్తోంది. మార్కెట్, ఆస్పత్రికి వెళ్లాలన్నా ఇబ్బందులకు గురవుతున్నాం. అత్యవసర వైద్య సేవల నిమిత్తం రోగులను తరలించే అంబులెన్సు సైతం అర్ధ గంట పాటు నిలిచిపోవాల్సి వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వెంటనే అండర్ బ్రిడ్జిని నిర్మించాలి.
>
> – వీకే శ్రీనివాసరావు, పార్వతీపురం

> **ట్రాఫిక్ అవస్థలు..**
>
> 
>
> ఈ మార్గంలో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో గేటు పడితే భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. చాలా సమయం వేచి ఉండాల్సి వస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వివిధ పనుల మీద పట్టణంలోకి వెళ్లాలంటే చాలా సమయం పడుతుంది. అండర్ పాస్ బ్రిడ్జిగానీ, ఫ్లైఓవర్‌గానీ నిర్మించాలి.
>
> – కె.వెంకట శ్రీధర్, బంగారమ్మకాలనీ, పార్వతీపురం

‘ఉపాధి’లో గుర్తించిన అక్రమాలు



బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదిక

బలిజిపేట: ఉపాధి పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన 2,404 పనులకు వెచ్చించిన రూ.26.36 కోట్లకు సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పీఓ రామచంద్రరావు సమక్షంలో గురువారం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, వెలుగు, గృహ నిర్మాణశాఖ, పశుసంవర్ధక శాఖ, సర్వశిక్ష అభియాన్, అటవీ శాఖ తదితర శాఖలకు చెందిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. 24 పంచాయతీల పరిధిలో రూ.26.36కోట్లతో 2,404పనులు నిర్వహించగా వాటిలో ఉండే లోపాలను గుర్తించారు. దీనిలో మండలం మొత్తం మీద రూ.68,313లకు రికవరీలు, అపరాధ రుసుములు విధించారు. అందులో భాగంగా చాలా గ్రామాల్లో మాస్టర్ లేకుండా కనీస సంతకాలు లేకుండా బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో మొక్కలు నాటకుండా నాటినట్లు ఫొటోలు చూపించి నిధులు కాజేసినట్టు గుర్తించారు. అజ్జాడ పంచాయతీలో ఆర్.గౌరునాయుడు, ఎల్.చిన్నంనాయుడులు మృతి చెందినా మూడు రోజుల బిల్లులు చెల్లించినట్టు గుర్తించారు. పణుకువలస పంచాయతీలో సుమారు 40మంది గ్రామంలో లేకపోయినా వారి పేరిట బిల్లులు పెట్టడంపై కె.శివ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. చదువుకున్న విద్యార్థులు వాగ్దేవి, రుణదేవు నూకరాజులకు బిల్లులు చెల్లించినట్టు గుర్తించగా వారిపై పర్యవేక్షణ జరుపుతామని అధికారులు సూచించారు. కొన్ని గ్రామాల్లో పనుల వద్ద బోర్డులు కూడా లేకుండా వాటిపై బిల్లులు వేలకు వేలు స్వాహా చేసినట్టు గుర్తించారు. సోషల్ ఆడిట్‌లో కనిపించిన తప్పులకు సంబందించి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల దగ్గర నుండి రికవరీలు చేపట్టడం జరుగుతుందని ఉన్నతాధికారులు తెలిపారు. ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ రవికుమార్, ఏపీడీఓ శ్రీహరిరావు, ఎస్ఆర్‌పీ మాధవరావు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ కేశవరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీడీ, ఎల్‌సీడీ సర్వేల పరిశీలన



పెదపెంకి పర్యవేక్షిస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీ పరిధిలో కుష్ఠు వ్యాధి, కేన్సర్ సర్వేలను బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో గురువారం పెదపెంకి, బైరిపురంలలో నిర్వహించారు. సర్వే సమయంలో కుష్ఠు అనుమానిత కేసులను గుర్తించి వాటిని నిర్ధారణ చేసిన అనంతరం వాటికి తగిన విధంగా వైద్యసేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎన్‌సీడీ సర్వేలో అనుమానిత కేసులను గుర్తించి ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్(విజయనగరం)కు పంపించడం జరుగుతుందన్నారు. దీనిపై పీహెచ్‌సీలో ఆశా వర్కర్లకు, సిబ్బందికి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి వ్యాధి గుర్తింపు ఏ విధంగా చేయాలనేది వివరించారు. గ్రామాల్లో సర్వేని నిర్వహించి అనుమానిత కేసులను తెలియపరచాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

జీడి మామిడి పంటకు మద్దతు ధర ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: జీడి మామిడి పంటకు క్వింటాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. స్థానికంగా విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. రైతుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 27న పట్టణంలో ఎన్‌జీఓ హోంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ హాజరవుతారన్నారు. సమావేశంలో రైతులకు సంబంధించి పలు అంశాలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఈవీ నాయుడు, కోశాధికారి బోత్స గౌరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సీమంతాలు



సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌జేడీ చిన్మయిదేవి పాల్గొన్నారు. గర్భిణులకు ఆమె ఆరోగ్యపరమైన పలు సూచనలు, సలహాలివ్వడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చిన పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకొని ఆరోగ్యం పట్ల డాక్టర్ల సూచన మేరకు ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. పెరటి తోటలు పెంపకాన్ని చూసారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ అనురాధ, రవణమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతి, పైడిరాజు పాల్గొన్నారు.

బాలల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా లీగల్ అండ్ ప్రొఫెషన్ అధికారి సత్యనారాయణ

సీతానగరం: జిల్లాలో బాలల సంరక్షణకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి, ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సేవా సంస్థలు, ఆశ్రమాలు తగు చర్యలు తీసుకోవాలని మన్యం జిల్లా లీగల్ అండ్ ప్రొఫెషన్ అధికారి ఎ.సత్యనారాయణ సూచించారు. పార్వతీపురం మండలం డీకే పట్నంలో లవ్ హోమ్, లచ్చయ్యపేట స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. లచ్చయ్యపేటలో మాట్లాడుతూ బాలల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అందుకనుగుణంగా తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. వసతిగృహాల్లో నిర్వాహకులు విధిగా నిబంధనలకు లోబడి పిల్లలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మౌలిక సదుపాయాలు ఉంటేనే సంస్థల నిర్వహణకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం పిల్లలకు అందిస్తున్న మెనూను పరిశీలించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసరు ఎస్.ప్రసాదరావు, ఎం.అరసవిల్లి, నల్లా సురేష్ ఉన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



బలిజిపేట: పెదపెంకిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న యువత



సాలూరు: బోసు బొమ్మ వద్ద నివాళులర్పిస్తున్న యువత

బలిజిపేట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో చంద్రబోస్ చిత్రపటం వద్ద గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో చురుకైన పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. కార్యక్రమంలో పి.పరుశురాం, కె.భాస్కర్, ఎం.వెంకటేష్, జి.శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌వరల్డ్ ఆధ్వర్యంలో..

సాలూరు: గ్రీన్ వరల్డ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సంతోష్‌కుమార్ శర్మ పాణిగ్రాహి ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మెయిన్‌రోడ్డు కూడలి వద్ద గల బోసు బొమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజి సేవలను భారతీయులు మరువలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు పిరిడి రామకృష్ణ, బెవర నాగార్జున తదితరులు పాల్గొన్నారు.


పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి



రామవరంలో మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: మండలంలో నిర్వహిస్తున్న ఉచిత పశుఆరోగ్య వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. మండలంలోని రామవరం, రెడ్డివానివలస గ్రామాల్లో నట్టల నివారణ, గర్భకోశ వ్యాధుల పరీక్షల పశుఆరోగ్య వైద్య శిబిరంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు ఆధ్వర్యంలో మూడు గ్రామాల్లో పశుఆరోగ్య వైద్య శిబిరాలు జరిగాయన్నారు. రెండు శిబిరాల్లో 380 పశువులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ పశువైద్యాధికారులు, పారా సిబ్బంది పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..!



బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద చేతికందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెల్లేవు..
- ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

బలిజిపేట:

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పలుచోట్ల ప్రాణసంకటంగా తయారయ్యాయి. వీటి చుట్టూ ఉండాల్సిన రక్షణ కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో జన సంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, నివాస గృహాలు, దుకాణాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రక్షణ కంచెల ఏర్పాటు విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చాలా చోట్ల గ్రామాల్లో చిన్నారుల చేతులకు అందే ఎత్తున చిన్నచిన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆయా చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మండల కేంద్రమైన బలిజిపేట బస్టాండ్ వద్ద పలు దుకాణాల మధ్య ఇరుకైన ప్రదేశంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు, ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరుతో పాటు పలు గ్రామాల్లో సింగిల్ ఫేజ్ నిమిత్తం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన ఫ్యూజ్ బాక్సులు చేతికందే ఎత్తులో దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనునిత్యం భయాందోళనల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ప్రాంతాల్లో నిత్యం విద్యార్థులు, మార్కెట్‌కు వచ్చిపోయే ప్రజలతో రద్దీ ఉంటుంది. అయినా విద్యుత్ శాఖాధికారులకు పట్టడం లేదు. ట్రాన్స్‌కో అధికారులు భద్రత చర్యలపై ఏమాత్రం దృష్టి సారించకపోవడం పట్ల స్థానికులు పెదవి విరుస్తున్నారు. పలుచోట్ల మూడడుగుల ఎత్తులోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయగా అధికారులు నిబంధనలు పాటించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మూడడుగుల దూరంలో ప్రజలు నడిచేలా చర్యలు తీసుకోవాలి. ఎల్‌టీ లైన్‌కు ఐదు మీటర్ల దూరంలో వాహనాల రాకపోకలు సాగేలా ఏర్పాటు చేయాలి. కానీ ఈ నిబంధనలు అమలు కావడం లేదు. గతంలో రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

> **ప్రతిపాదనలు పంపుతాం..**
>
> విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తు దిమ్మలపై ఏర్పాటు చేశాం. కంచెల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – సింహాచలం, ఏఈ, విద్యుత్ శాఖ, బలిజిపేట



బలిజిపేట బస్టాండులో షాపుల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



మక్కువ - సాలూరు రోడ్డు దుస్థితి



కవిరిపల్లి గ్రామంలో మలుపు వద్ద ప్రమాదకరంగా రహదారి

జాతర వేళ.. రహదారులిలా...!

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. జాతరకు ఆంధ్ర, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన భక్తులతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో శంబరకు తరలి రానున్నారు. అమ్మ దర్శనానికి సాలూరు, బొబ్బిలి, చినబోగిలి రహదారుల గుండా శంబర చేరుకోవాల్సి ఉంది. అయితే ఈ రహదారులన్నీ అధ్వానంగా తయారవడంతో జాతరకు ఎలా వెళ్లాలని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గాల గుండా ప్రయాణించి జాతరకు చేరుకోవడమంటే ఒక సాహసమేనని వారు పేర్కొంటున్నారు. – మక్కువ